



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే

మూడు ప్రధాన బహుమతులతో పాటు 125 కన్సొలేషన్ కానుకలు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అభిమాన పాఠకులు ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' మంగళవారం జరగనుంది. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో 'కార్ అండ్ బైక్ రేస్' అదృష్ట పాఠకులు ఎవరన్నది తేలనుంది. సాయంత్రం 4.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖులు అతిథులుగా పాల్గొని పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. మరో 125 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2వేలు విలువచేసే గృహోపకరణాలను అందిస్తారు.

2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 12 కూపన్లను (4 సెట్లు) పాఠకులు ఇప్పటికే ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారు. జిల్లాలో వేల సంఖ్యలో ఈ కూపన్లు పంపగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది మంగళవారం తేలనుంది. డ్రాకు హాజరుకాలేని విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది. ఈ కూపన్లు మళ్లీ విజయవాడలో జరిగే లక్కీడ్రాకు వెళతాయి. అక్కడి డ్రాలో గెలిచిన రాష్ట్ర విజేతకు మారుతి కారు బహుమతిగా దక్కుతుంది.




సమయం : మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు

వేదిక : దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయం

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:29 (బుధవారం ఉదయం)



1 నుంచి టోల్ బాదుడు

● రాష్ట్రవ్యాప్తంగా టోల్‌గేట్ల రుసుము పెంపు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టోల్‌గేట్లలో వాహనాల రుసుమును రూ.5 నుండి రూ.25 వరకు పెంచనున్నారు. ఈ పెంచిన రుసుము ఏప్రిల్ ఒకటి నుండి వర్తింపజేయనున్నారు. జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 76 టోల్‌గేట్లున్నాయి. గత రెండేళ్లలో కొత్తగా 12 టోల్‌గేట్లు తెరిచారు. వీటిలో 40 టోల్‌గేట్లలో ఏప్రిల్ ఒకటి నుండి టోల్ గేట్ రుసుమును రూ.5 నుంచి రూ.25 దాకా పెంచనున్నారు. తక్కిన 48 టోల్‌గేట్లలో సెప్టెంబరు ఒకటి నుండి రుసుము పెంచనున్నారు. నగరంలోని వానగరం, సూరపట్టు టోల్ గేట్, చెన్నై - కోల్‌కతా రహదారిలోని నల్లూరు టోల్‌గేట్, తాంబరం - దిండివనం మార్గంలోని ఆత్తూరు టోల్‌గేట్, పరనూరు టోల్ గేట్లలో ఈ కొత్త రుసుము అమలులోకి రానున్నాయి. దీనివలన వల్ల కాయగూరలు, కిరాణా సరకుల ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్ర నుంచి చెన్నైకి సరకులను లారీలో తీసుకువచ్చేందుకు టోల్‌గేట్ రుసుము కనీసం రూ.1000లకు పైగా చెల్లించాల్సి ఉంటుందని, దీంతో నిత్యావసర వస్తువుల ధరలు, లారీ బాడుగలు కూడా పెరుగుతాయని లారీ యజమానుల సంఘం నాయకులు చెబుతున్నారు.



నాలుగు రోజులు ఎండ తీవ్రం

● మధ్యాహ్నం ఇంటివద్దే ఉండండి ● ఐఎండీ హెచ్చరిక

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా రోజురోజుకూ పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై సహా ప్రధాన నగరాల్లో ఉదయం 9 గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. ఇప్పటికే ఈ యేడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. ఇప్పుడు తాజాగా వచ్చే నాలుగు రోజులు రాష్ట్రంలో ఎండలు మరింత ఉంటాయని వారు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితులలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలో విపరీతంగా ఎండలు ఉంటాయని, వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 గంటల వరకూ ఇంటిపట్టునే ఉండడం మంచిదని సూచించారు. రాష్ట్రంలోని వేలూరు, నామక్కల్, కరూరు, తిరుచ్చి జిల్లాల్లో సాధారణ స్థాయికంటే అధికంగా ఎండలు కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై సహా ఉత్తరాది జిల్లాల్లో నాలుగు రోజుల పాటు పగటిపూట వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు ఇక ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు ఇంటి నుండి బయలు దేరేటప్పుడే గొడుగులు, టోపీ వెంట తీసుకెళ్లడం మంచిదని తెలిపారు. కార్యాలయాల్లో, ఇళ్లలోనూ ఫ్రిజ్‌లో చల్లబరచిన నీటిని తాగకూడదని, మట్టికుండలోని నీళ్లను తాగటం శ్రేయస్కరమని చెబుతున్నారు. రైళ్లలో, బస్సులలో ప్రయాణించే వారు స్టీలు, అల్యూమినియం వాటర్‌బాటిళ్లలో నీటిని వెంట తీసుకెళ్లాలని తెలిపారు. తరచూ నిమ్మరసం తాగాలని, ఆపిల్, జామ, సపోటా, అరటి తదితర పండ్లను అధికంగా తింటే వడదెబ్బ నుండి తప్పించుకోవచ్చునని తెలిపారు.

పుదుచ్చేరి అసెంబ్లీలో గలభా

● ప్రజాపనుల శాఖలో అవినీతిపై చర్చకు డీఎంకే-కాంగ్రెస్ పట్టు ● తరువాత చర్చిద్దామన్న స్పీకర్ ● పోడియాన్ని ముట్టడించిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ● సభ నుంచి గెంటివేత

పుదుచ్చేరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి అసెంబ్లీలో సోమవారం ఉదయం స్పీకర్ పోడియంను ముట్టడించిన డీఎంకే-కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యేలను మార్షల్స్ సభ నుండి గెంటేశారు. పుదుచ్చేరి ప్రజాపనుల శాఖ రూ.100 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ, ఆదాయ పన్ను శాఖలకు పలు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ చీఫ్ ఇంజనీర్ దీనదయాళన్, కారైక్కాల్ సూపర్‌వైజేషన్ ఇంజనీర్ చంద్రశేఖరన్, ఇంజనీర్లు చిదంబరనాథన్ శనివారం బీచ్ రోడ్డులో వున్న ప్రభుత్వం అతిథి గృహంలో బసచేసినట్లు తెలిసింది. అప్పుడు మన్నార్‌గుడికి చెందిన ఓ కాంట్రాక్ట్ సంస్థ అధికారి ఇళమురుగన్ ప్రజా పనుల శాఖ కాంట్రాక్ట్ పనుల నిమిత్తం లక్షలాది రూపాయలను ఆ అధికారులకు ఇస్తున్న సమయంలో అక్కడే నిఘా వేసిన సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అంతేకాకుండా పుదుచ్చేరిలో వున్న దీనదయాళన్ ఇళ్లు, కారైక్కాల్‌లో వున్న చిదంబరనాథన్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించి పెద్దమొత్తంలో నగదు, నగలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపిన అనంతరం ఆ ఇద్దరు అధికారులు సహా ఇళమురుగన్ (52)లను అరెస్టు చేశారు. ఇదిలా వుండగా సోమవారం ఉదయం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్- డీఎంకే సభ్యులు లేచి అవినీతి పాల్పడిన ప్రజా పనుల శాఖ ఉన్నతాధికారులను డిస్మిస్ చేయాలని, ఆ శాఖామంత్రి లక్ష్మీనారాయణ పదవి నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతిపై చర్చించేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వారు స్పీకర్ సెల్వం పోడియంను ముట్టడించి నినాదాలు చేశారు. అయితే జీరో అవర్‌లో చర్చిద్దామని, అప్పటి వరకూ కూర్చోవాలని స్పీకర్ ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన వారిని గెంటేయాలని మార్షల్స్‌ను ఆదేశించారు.



ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం వివరాలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి

డీ-లిమిటేషన్‌పై ఢిల్లీకి

● త్వరలో ప్రధానితో తమిళ ఎంపీల భేటీ ● అసెంబ్లీలో ప్రకటించిన స్టాలిన్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): న్యాయసమ్మతమైన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోరుతూ ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం త్వరలో తమిళ ఎంపీలు ప్రధాని నరేంద్రమోదీని కలిసి జేఏసీ తీర్మానం నకలును అందజేయనున్నారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. సోమవారం ఉదయం శాసనసభలో ఇటీవల ఏడు రాష్ట్రాలకు చెందిన పార్టీల నేతలతో జరిగిన ఉమ్మడి కార్యాచరణ మండలి సమావేశం వివరాలను వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరుగకూడదని, కుటుంబ నియంత్రణ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలను దండించేలా ఎంపీల సంఖ్యను ఏ మాత్రం తగ్గించకూడదని ఫిబ్రవరి 14న శాసనసభలో తీర్మానం చేశామని, భారతదేశంలోనే మొదటిసారిగా పునర్విభజనకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పునర్విభజన వల్ల నష్టపోనున్న దక్షిణాది రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు దిశగా ఏడు రాష్ట్రాలకు చెందిన పార్టీల ప్రతినిధులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశం కూడా విజయవంతమైందని తెలిపారు. ఆ సమావేశంలో 2026 నుండి మరో 30 యేళ్లపాటు నియోజకవర్గాల పునర్విభజన వాయిదా వేయాలని, ప్రస్తుతమున్న ఎంపీల సంఖ్యనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేసి, అవసరమైతే చట్ట సవరణ చేసి ఆమోదించాలని విజ్ఞప్తి చేసినట్లు స్టాలిన్ వివరించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఏయే నిష్పత్తిలో నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తారో అదే రీతిలో దక్షిణాది రాష్ట్రాల్లోనూ పునర్విభజన చేయాలని ఆయన కోరారు. ఉమ్మడి కార్యాచరణ కమిటీ నిర్ణయం ప్రకారం పునర్విభజన పేరుతో ప్రజా ప్రతినిధుల సంఖ్య ఏమాత్రం తగ్గించకూడదని కోరుతూ ఏడు రాష్ట్రాల శాసనసభల్లో తీర్మానం చేసి, ఆ తీర్మానం నకలును కేంద్ర ప్రభుత్వానికి త్వరలో పంపనున్నారని పాలకపక్షం సభ్యుల హర్షధ్వానాల నడుమ స్టాలిన్ ప్రకటించారు. తమిళనాట పునర్విభజనపై ప్రజల్లో అవగాహన పెరిగిందని, దేశ వ్యాప్తంగా జేఏసీ తీర్మానానికి మంచి స్పందన వస్తోందని చెప్పారు. జేఏసీ ఏర్పాటు దిశగా అఖిలపక్ష సమావేశంలో తమకు మద్దతునిచ్చిన ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అన్ని పార్టీల నేతలకు సీఎం స్టాలిన్ ధన్యవాదాలు తెలిపారు. 'తమిళనాడు ఉద్యమిస్తుంది.. విజయం సాధిస్తుంది' అనే నినాదంతో పునర్విభజనపై జేఏసీ తీర్మానాన్ని తమిళ ఎంపీలు త్వరలో ప్రధాని నరేంద్రమోదీని కలుసుకుని అందజేయనున్నారని సభాముఖంగా సభ్యులందరికీ స్టాలిన్ వెల్లడించారు.

మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు

● అన్నామలై, హెచ్.రాజాపై కేసులు





అన్నామలై - హెచ్.రాజా

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వాఖ్యలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, ఆ పార్టీ సీనియర్ నేత హెచ్.రాజాపై సేలం పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుప్పరంగుండ్రం పూర్తిగా మురుగన్‌కు చెందినదని, అందువల్ల ఈ ప్రాంతంలోని దర్గా తొలగించాలని 1931లో లండన్ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, హెచ్.రాజా ప్రకటించారని, వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ సేలంకు చెందిన సామాజికవేత్త ప్యూస్ సేలం నగర పోలీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ కు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు విచారణ చేపట్టగా, సోమవారం సైబర్ క్రైం పోలీసులు అన్నామలై, హెచ్.రాజాలపై కేసు నమోదుచేశారు. ఈ విషయమై ప్యూస్ మాట్లాడుతూ... మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా అన్నామలై, రాజా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం తిరుప్పరంగుండ్రం కొండ వ్యవహారంపై అసత్య ప్రచారం చేసినందుకు అన్నామలై, రాజాలపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేశారని తెలిపారు. ఐకమత్యంగా ఉన్న రాష్ట్ర ప్రజల మధ్య మతచిచ్చు పెట్టేలా అన్నామలై వ్యవహారశైలి ఉందని, అతడిపై తగిన చర్యలు చేపట్టాలని ప్యూస్ డిమాండ్ చేశాడు.

దేవుళ్లు సరిగానే ఉన్నారు.... కొందరు మనుషులే తేడా..!

● తిరుప్పరంగుండ్రం వ్యవహారంలో హైకోర్టు ధర్మాసనం అసంతృప్తి ● ఆ కొండ మాకే సొంతం: కేంద్ర పురావస్తు శాఖ

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దేవుళ్లంతా సరిగానే ఉన్నారు.. కొందరు మనుషులు మాత్రమే తేడాగా వున్నారంటూ హైకోర్టు మదురై ధర్మాసనం కటువుగా వ్యాఖ్యానించింది. మదురై జిల్లా తిరుప్పరంగుండ్రం కొండను 'జైన కొండ'గా ప్రకటించాలని కోరుతూ విల్లుపురం స్వస్తిశ్రీ లక్ష్మీసేన స్వామి తరఫున మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. తిరుప్పరంగుండ్రం కొండ జాతీయ ప్రాముఖ్యత కలిగిన పర్వతమని, ఈ కొండ జైనుల కొండ అని, అందువల్ల తిరుప్పరంగుండ్రం కొండను జైన కొండగా ప్రకటించాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. అంతేగాక జైన ధర్మాలకు విరుద్ధంగా కొండపై జరిగే కార్యకలాపాలు నిషేధించాలని, తిరుప్పరంగుండ్రం కొండను పునరుద్ధరించి కాపాడేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. అలాగే, తిరుప్పరంగుండ్రం కొండ మీద సికిందర్ బాషా దర్గా నిర్వాహకులు జంతు లను బలివ్వడం, మాంసాహారం వండడం, వడ్డించడంపై నిషేధం విధించాలని మదురై చోళై అళగుపురానికి చెందిన చోలైకన్నన్, తిరుప్పరంగుండ్రం కొండపై నెల్లితోపు ప్రాంతంలో ఇస్లామీయులు ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించడంపై నిషేధం విధించాలంటూ రామలింగం అనే వ్యక్తులు కూడా వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ జె.నిషాభాను, జస్టిస్ ఎస్.శ్రీమతితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మదురై జిల్లా కలెక్టర్, మదురై నగర పోలీస్ కమిషనర్ తరఫున కౌంటర్ అఫిడవిట్లు దాఖలయ్యాయి. తిరుప్పరంగుండ్రం కొండ చుట్టూ అరుళ్‌మిగు 18వ మెట్టు కరుప్పస్వామి, పాండి మునీశ్వరస్వామి ఆలయం, మలైయాండి కరుప్పుస్వామి ఆలయం, మునియప్పన్ ఆలయాల్లో జంతు బలులివ్వడం ఆచారంగా ఉందని అఫిడవిట్లలో వివరించారు. తిరుప్పరంగుండ్రం కొండ ఉత్తరం వైపున మురుగన్ ఆలయం, దక్షిణం వైపున జైన చిహ్నాలు, మధ్యలో దర్గా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాన్ని హిందువులు 'స్కందమలై' అని, ముస్లింలు 'సికిందర్ హిల్' అని, జైనులు 'జైన హిల్' అని, స్థానిక ప్రజలు 'తిరుప్పరంగుండ్రం కొండ' అని పిలుస్తుంటారన్నారు. అన్ని మతాల మధ్య ఐక్యత నెలకొనాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఆ ప్రకారం జనవరి 30వ తేది ఇరు మతాల మధ్య శాంతి సమావేశం నిర్వహించామన్నారు. అందులో.. దర్గాకు వచ్చిన వారి కోర్కెలు నెరవేరితే మేకలు, కోళ్లు బలిచ్చి, వండి అందరూ భుజిస్తారని తెలిపారు. తిరుప్పరంగుండ్రం ప్రాంతంలోని ఇరువర్గాలు కూడా ప్రస్తుతం ఉన్న పూజా విధానాలనే కొనసాగించాలని, బయట వ్యక్తులెవ్వరూ జోక్యం చేసుకోరాదని, ఈ విషయంలో గందరగోళం సృష్టించరాదని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. అలాగే, ఇస్లామీయులు మాత్రమే కాకుండా ఇతర వర్గాలు కూడా తమ కోర్కెలు ఫలిస్తే మేకలు, కోళ్లు బలిచ్చి, వండుకొని అందరూ కలసి భోంచేయడం ఆనవాయితీ ఉందన్నారు. అదనంగా 1991లో ప్రవేశపెట్టిన ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల ప్రకారం, 1947 ఆగస్టు 15 నాటికి ఒకప్రార్థనా స్థలం ఎలా ఉందో, అలాగే దానిని సంరక్షించాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందని గుర్తు చేశారు. అనంతరం తిరుప్పరంగుండ్రం కొండ ప్రాంతంలో తలెత్తిన సమస్యకు పరిష్కారం లభించిందని ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది తెలిపారు. తిరుప్పరంగుండ్రం కొండ పురావస్తు శాఖకు సొంతమైనదని, అందువల్ల తిరుప్పరంగుండ్రం కొండపై ఏం చేసినా కేంద్ర పురావస్తు శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి వుందని స్పష్టం చేస్తూ.. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని కేంద్ర పురావస్తు శాఖ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. పిటిషనర్ల తరఫున తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఈ విషయంలో 1923లో మదురై ప్రిన్సిపల్ సెషన్స్ ఇచ్చిన ఉత్తర్వులను బ్రిటిష్ కౌన్సిల్ ధ్రువీకరించిందని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. తిరుప్పరంగుండ్రం కొండ అందరికి సొంతమైనదని పేర్కొంది. దేవుళ్లు అందరూ సక్రమంగానే ఉన్నారని... కొందరు మనుషులు మాత్రం సరిగా లేరని పేర్కొంటూ, పురావస్తు శాఖ తరఫున అఫిడవిట్ వేసేందుకు సమయం ఇస్తూ, తదుపరి విచారణ ఏప్రిల్ 7వ తేదీకి వాయిదావేసింది.



సమాచార దర్శిని

'తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం' ఆధ్వర్యంలో
30న ఉగాది వేడుకలు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం' ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఉగాది వేడుకలు జరుగనున్నాయి. పెరంబూర్‌లోని డీఆర్‌బీసీ సీసీ మహోన్నత పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు తమ్మినేని బాబు అధ్యక్షత వహించనుండగా, ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు ముఖ్య అతిథిగా, మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు విశిష్ట అతిథిగా, పారిశ్రామికవేత్త నర్రావుల వెంకటరమణ ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. బహుభాషా పండితులు డాక్టర్ టీఆర్‌ఎస్ శర్మ పంచాంగ పఠనం చేయనుండగా, నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనాగీతం ఆలపించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

బెంగళూరు విమానం
చెన్నైలో అత్యవసర ల్యాండింగ్

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 172మంది ప్రయాణికులతో వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం చెన్నైలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఢిల్లీ నుంచి బెంగళూరు వెళ్తున్న విమానంలో తగినంత ఇంధనం లేకపోవడాన్ని గుర్తించిన పైలెట్ చెన్నై విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారుల అనుమతితో ఆ విమానాన్ని చెన్నైలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఇంధనం నింపుకున్న అనంతరం ఆ విమానం తిరిగి బెంగళూరు బయల్దేరి వెళ్లింది.

డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో, డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని రవాణా శాఖ డిపో మేనేజర్లకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బస్టాండ్లు, టైమ్‌కీపర్ గదులు, క్యాంటీన్లు, విశ్రాంతి గదుల్లో తగినంత నీరు, మజ్జిగ ఉంచాలన్నారు. డిపోల్లో ఉన్న ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులకు గురైతే వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రతతో తలనొప్పి, మైకం తదితర అనారోగ్యం ఏర్పడితే వెంటనే అధికారులకు తెలియజేయాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు.

ఖనిజాల ద్వారా
రూ.1,704 కోట్ల ఆదాయం

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25వ ఆర్థిక సంవత్సరంలో ఇప్పవరకు ఖనిజాల ద్వారా రూ.1,704 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ మేరకు శాసనసభలో సహజ వనరుల శాఖ పాలసీ బ్రీఫింగ్ నోట్‌లో తెలియజేసింది. అలాగే, ఫిబ్రవరి వరకు జరిమానా ద్వారా రూ.60 కోట్లు వసూలుకాగా, ఖనిజాలు అక్రమంగా తరలిస్తున్న 3,741 వాహనాలను జప్తు చేసినట్లు ఆ శాఖ తెలిపింది.

జలాశయాల్లో
76 శాతం నీటినిల్వలు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై వాసులకు తాగునీరందించే జలాశయాల్లో 76 వాతం నీటి నిల్వలున్నాయి. పూండి, చోళవరం, పుళల్, చెంబరంబాక్కం, కన్నన్‌కోట - తేర్వాయ్ కండిగై తదితర ఐదు జలాశయాల నుంచి నగరానికి తాగునీరు సరఫరా చేస్తుండగా, ఈ జలాశయాల పూర్తి సామర్థ్యం 11,757 మిలియన్ ఘనపుటడుగులు కాగా, ప్రస్తుతం ఐదు జలాశయాల్లో 8,964 మిలియన్ ఘనపుటడుగులు (76 శాతం) నీటి నిల్వలున్నాయి. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుతం 698 మిలియన్ ఘనపుటడుగుల నీరు అధికంగా ఉంది. ఈ ఐదు జలాశయాలతో పాటు మీంజూరు, నెమ్మేలి నిర్లవణీకరణ కేంద్రాల నుంచి రోజుకు 300 మిలియన్ ఘనపుటడుగుల నీరు సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవి కాలంలో నగరవాసులకు కొరత లేకుండా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో
ఏడుగురికి గాయాలు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఓ బాలుడు సహా ఏడుగురికి గాయాలయ్యాయి. కన్నియాకుమారి జిల్లా ఆరల్‌వాయిమొళి సమీపం ఎంజీఆర్ నగర్‌లో సోమవారం ఉదయం హఠాత్తుగా ఓ పిచ్చి కుక్క రోడ్డుపై వెళుతున్న వారిపై దాడి చేసింది. ఈ ఘటనలో ఓ బాలుడు సహా ఏడుగురికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని వెంటనే పూతపాండి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు.

రద్దీ రోడ్లపై దుకాణాలు వద్దు
● జీసీసీకి ట్రాఫిక్ పోలీసుల లేఖ

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలంలో 168 నుంచి 180 వరకు వార్డులున్నాయి. ఈ మండల పరిధిలోని గిండి, సైదాపేట, వేళచ్చేరి, అడయార్, తిరువాన్మియూర్, తరమణి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. రద్దీ నియంత్రణలో భాగంగా ఎంపిక చేసిన రోడ్లపై వాహనాల పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసులు అనుమతులు నిరాకరిస్తున్నారు. అలాగే, రద్దీగా ఉండే రోడ్ల పక్కన దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వొద్దని ట్రాఫిక్ పోలీసు విభాగం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)కి లేఖ రాసింది.

రామనాథస్వామి ఆలయంలో
చలువ పందిళ్లు



పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడి నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేలా రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత క్రమక్రమంగా పెరుగుతోంది. రామనాథపురం జిల్లాలో కూడా కొద్దిరోజులుగా ఎండలు ఎక్కువవుతున్నాయి. రామేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులు ఎండ వేడితో ఇబ్బంది పడుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగించేలా చర్యలు చేపట్టాలని భక్తులు ఆలయ నిర్వాహకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై స్పందించిన ఆలయ నిర్వాహకులు, ఆలయ ప్రాంగణంలోని రథం వీధిలో పచ్చని పందిరి ఏర్పాటుచేశారు. కాగా, కొద్దిరోజుల క్రితం స్వామి దర్శనానికి వచ్చిన క్యూలైన్లలో ఉన్న భక్తుడు స్పృహతప్పి మృతిచెందిన విషయం తెలిసింది. దీంతో, మున్సిపాలిటీ యంత్రాంగం, ఆలయ నిర్వాహకులు సంయుక్తంగా పందిళ్లు ఏర్పాటుచేశారు.

మెదడు నిర్జీవమైన
యువకుడి అవయవదానం



రామ్‌దర్శన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన యువకుడి అవయవాలు దానం జేసి పలువురికి పునర్జన్మ కల్పించాడు. తిరుప్పూర్ వెళ్లియంపది ప్రాంతానికి చెందిన తిరునావుక్కరసు-ధనలక్ష్మి దంపతుల కుమారుడు రామ్‌దర్శన్ (20) ద్విచక్రవాహనంలో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, కోయంబత్తూర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడ చికిత్సలు ఫలించక రామ్‌దర్శన్ మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనతో రామ్‌దర్శన్ అవయవాలు అందజేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో, కాలేయం, కిడ్నీలు, కళ్లు ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా తీసిన వైద్యబృందం, కోవై, సేలం ప్రభుత్వాసుపత్రులు, ఓ ప్రైవేటు ఆసుపత్రికి అందజేశారు. మృతిచెందిన రామ్‌దర్శన్ భౌతికకాయానికి ఆస్పత్రి తరపున నివాళులర్పించి, అతని స్వగ్రామానికి పంపించారు.

ఎస్‌ఎంసీ సభ్యులకు
గుర్తింపుకార్డులు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) సభ్యులకు గుర్తింపుకార్డుల ఇవ్వాలని ఏకీకృత పాఠశాల విద్య రాష్ట్ర పథక డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ కమిటీలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, స్థానిక సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, విద్యానిపుణులుంటారు. పాఠశాలల అభివృద్ధి, మెరుగైన విద్యా బోధన తదితరాలపై ఈ కమిటీ చర్చిస్తుంది. ఈ నేపథ్యంలో, కమిటీ సభ్యులకు గుర్తింపుకార్డులు, లెటర్ ప్యాడ్ తదితరాలు పాఠశాల స్థాయిలోనే ఏర్పాటుచేసుకోవాలని, ఈ పనులను జిల్లా ప్రధాన విద్యాధికారులు పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మధురవాయల్‌లో
రూ.11 కోట్లతో కమ్యూనిటీ హాల్

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం మండలం మధురవాయల్‌లో రూ.11 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సీఎండీఏ నిర్ణయించింది.. 147వ వార్డు వివేకానందర్ వీధిలో కార్పొరేషన్ వార్డు కార్యాలయం ఎదురుగా కార్పొరేషన్‌కు కమ్యూనిటీ హాలు ఉంది. ఈ కమ్యూనిటీ హాల్ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో శిధిలావస్థకు చేరుకుంది. ఈ విషయమై స్థానికుల విజ్ఞప్తి మేరకు, శిధిలమైన కమ్యూనిటీ హాల్ స్థలంలోనే రెండు అంతస్తులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

తిరువేర్కాడు మున్సిపాలిటీలో
రూ.519 కోట్లతో భూగర్భ డ్రైనేజీ

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపం తిరువేర్కాడు మున్సిపాలిటీలో రూ.510 కోట్లతో భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్ట్ చేపట్టనున్నారు. 2023లో తిరువేర్కాడు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మున్సిపాలిటీలో నూంబల్, చంద్రచోళపురం, వీరరాఘవపురం, అయనంబాక్కం, పెరుమాళ్ అగరం, కోలడి తదితర ప్రాంతాలున్నాయి. నగర శివారు ప్రాంతం కావడంతో తిరువేర్కాడు మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో, గృహాలు, కార్యాలయాల నుంచి వచ్చే మురుగునీరు సమీపంలోని స్థలాలు, జలవనరుల్లో చేరకుండా రూ.510 కోట్లతో భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్ట్ సిద్ధం చేసి, 22,397 గృహాలకు డ్రైనేజ్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ఐపీఎల్ మ్యాచ్ చూసి
వెళ్తుండగా ప్రమాదం...
ఇద్దరు విద్యార్థుల మృతి

టి.నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూరు సమీపంలో మెట్రో రైలు స్తంభాన్ని బైకు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. వీరిద్దరూ ఆదివారం రాత్రి చేపాక్ స్టేడియంలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ చూసి ఇంటికి బైకులో వెళ్తుండా ప్రమాదానికి గురయ్యారు. రామాపురం ప్రాంతానికి చెందిన విద్యార్థులు కాల్విన్ కెన్నీ, సిద్దార్థన్ చేపాక్ మైదానానికి వెళ్ళి క్రికెట్ మ్యాచ్ చూసిన తర్వాత బైకులో ఇళ్లకు బయలుదేరారు. ఆలందూరు వద్ద బైకు అదుపుతప్పి మెట్రోరైలు స్తంభాన్ని ఢీకొని, రోడ్డుపై పడటంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలుతగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పరంగిమలై ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాలన పోస్టుమార్టంకు తరలించారు.

చెన్నైలో 'వేల్' యాత్రకు అనుమతి లేదు
● సుప్రీంకోర్టు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంగుండ్రం కొండ వ్యవహారంలో చెన్నైలో వేల్ యాత్ర చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన అప్పీలు పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం తోసిపుచ్చింది. తిరుప్రరంగుండ్రం కొండ వ్యవహారంపై రెండు మతాల వారు చేసిన వ్యాఖ్యలు, కోర్కెలు కలకలం రేపాయి. ఈ వ్యవహారంలో తిరుప్పరంగుండ్రం కొండ కోసం నగరంలో 'వేల్ యాత్ర' చేపట్టేందుకు అనుమతి కోరుతూ హిందూ మున్నని సంస్థ పెట్టుకున్న దరఖాస్తును పోలీసు శాఖ నిరాకరించింది. ఈ కారణంగా, వేల్ యాత్రకు అనుమతి కోరుతూ హిందూ మున్నని మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జీకే ఇళంద్రియన్... తిరుప్పరంగుండ్రం సమస్యకు, చెన్నైకి ఏంటి సంబంధం? తిరుప్పరంగుండ్రం కొండ రక్షించాలంటూ చెన్నైలో ర్యాలీ చేపట్టాల్సిన అవసరం ఏమిటి? అనవసర సమస్యలు సృష్టించాలని చూడొద్దు అంటూ తీవ్రంగా మందలించడంతో పాటు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, హిందూ మున్నని సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ సోమవారం న్యాయమూర్తి బేలా త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి, వేల్ రథయాత్రకు అనుమతి నిరాకరించారు. చెన్నైలో వేల్ రథయాత్ర చేపట్టేందుకు నిరాకరించిన హైకోర్టు ఉత్తర్వులు సరైనవని, ఈ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని వ్యాఖ్యానిస్తూ, అప్పీలు పిటిషన్ తోసిపుచ్చుతూ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

కపటనాటకాలతో
జాక్టో-జియోను మోసగించొద్దు
● ప్రభుత్వానికి టీవీకే నేత విజయ్ హెచ్చరిక



టి.నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను మాయమాటలతో మోసం చేయొద్దంటూ తమిళగ వెట్రికళగం నేత విజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డీఎంకే ప్రభుత్వం యేళ్ల తరబడి ఆడుతున్న కపటనాటకాన్ని ఓర్చుకోలేకే జాక్టో-జియో నాయకులు, సభ్యులు ఆదివారం ఆందోళన చేపట్టారన్నారు. ఈ మేరకు ఆయన ఓ సుదీర్ఘ ప్రకటన జారీ చేస్తూ తమ న్యాయమైన కోర్కెల సాధనకు జాక్టో- జియో సంఘాలు జరుపుతున్న ఆందోళనకు తమ పార్టీ మద్దతునిస్తుందని విజయ్ ప్రకటించారు. 2003 ఏప్రిల్ ఒకటి తర్వాత ప్రభుత్వ సర్వీసుల్లో చేరిన సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ పద్ధతిని అమలు చేయకుండా కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీము అమలు చేసి రిటైర్మెంట్ తర్వాత ప్రతినెలా ఇచ్చే పింఛన్‌ను వీరికి వర్తింపజేయడం లేదని విజయ్ ఆరోపించారు. జాక్టో- జియో ఆందోళన రాష్ట్రంలోని లక్షలాదిమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు కుటుంబాలకు సంబంధించిన విషయంఅనే భావన ప్రభుత్వానికి లేకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. డీఎంకే ప్రభుత్వం పట్టుదలలకు పోకుండా, వీరి సమస్యలను రాజకీయ పరమైన భావనతో కాకుండా మానవతా భావంతో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రచారార్భాటాలకే ప్రాధాన్యం ఇస్తున్న డీఎంకే ప్రభుత్వం నాలుగేళ్లకు ముందు ఎన్నికలమేనిఫెస్టోలో 309వ హామీ (జాక్టో-జియో సంఘాలకిచ్చిన హామీ)ని ఇకనైనా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు
టీవీకే ఆర్థిక సాయం



తిరుత్తణి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గత నెలలో తిరుత్తణి-చిత్తూరు హైవేపై ఓ టిప్పర్‌లారీ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకులు ఆ మృతుల కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.10వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి వి.ఢిల్లీబాబు, సంయుక్త కార్యదర్శి జ్ఞానం, కోశాధికారి స్టాలిన్, ఉపకార్యదర్శి బాలా, యువజన విభాగం నాయకులు లింగప్పన్, మహిళా కార్యదర్శి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల శత వార్షికోత్సవం



చిన్నారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్

తిరుత్తణి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని సెంగళత్తూరు అగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాలలో శత వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ హాజరై 1వ తరగతి చిన్నారులను మేళతాళాలతో పాఠశాల ప్రాంగణంలో తిప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, పిల్లలు దైవంతో సమానమని, పిల్లలను పూజిస్తే దైవాన్ని పూజించినట్లేనని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేస్తున్నామని, కొత్తగా అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ సకాలంలో అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు చలపతి, జాస్మిన్, డీఎంకే కార్యదర్శి రాజేంద్రన్, కౌన్సిలర్ శ్యామ్ సుందర్, కలైసెల్వి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుట్కా విక్రయించిన
ఇద్దరు మహిళల అరెస్ట్

ప్యారీస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాన్‌తోపు ప్రాంతంలో తనిఖీ చేసిన పోలీసులు 4,800 గ్రాముల గుట్కా స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. పులియాన్‌తోపు ఎంఎస్.ముత్తునగర్ ప్రాంతంలో దుకాణాలు నడుపుతున్న భవాని, లక్ష్మిలను గుర్తించి అరెస్టు చేశారు. వీరిపై ఇప్పటికే 7 గుట్కా కేసులు పెండింగులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తెగిన విద్యుత్ తీగలు...
● గడ్డి లారీకి తప్పిన ముప్పు



వాహనంలోని గడ్డిని దించుకున్న గ్రామస్థులు

తిరుత్తణి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అమ్మనేరి గ్రామంలో గడ్డిని తరలిస్తున్న ఓ మినీలారీ తగలడంతో విద్యుత్ తీగలు తెగి, మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్థులు ఆ మినీలారీని ఆపి, సరైన సమయంలో గడ్డిని కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

ఏనుగు, చిరుతపులి
దంతాల స్వాధీనం
● నలుగురి అరెస్ట్



ఏనుగు, చిరుతపులి దంతాలతో పట్టుబడిన నిందితులు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలో ఏనుగు , చిరుతపులి దంతాలు తరలించి విక్రయించేందుకు యత్నించిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లా మేట్టూరు నుంచి కోయంబత్తూర్‌కు ఏనుగు దంతం, చిరుతపులి దంతాలు అక్రమంగా తరలిస్తున్నట్లు కోయంబత్తూర్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దాని ఆధారంగా ఫారెస్ట్ రేంజర్ నేతృత్వంలో సిబ్బంది శనివారం రాత్రి గాంధీపురం రాంనగర్ రామాలయం సమీపంలో వాహన తనిఖీలు చేపట్టగా, అటువైపు వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. అందులో ఏనుగు దంతం, చిరుతపులి దంతాలుండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న కృప (24), సతీష్‌కుమార్ (26), విజయన్ (45), గౌతమ్ (26)లను అరెస్ట్ చేసి, వీటిని ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారు, ఎక్కడ విక్రయించేందుకు వెళ్లున్నారు సహా పలు కోణాల్లో విచారణ చేపట్టారు.

విరుదునగర్ కానిస్టేబుల్ హత్యకేసులో
నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు



హత్యకు గురైన కానిస్టేబుల్ మలైయరసన్ (ఫైల్‌ఫొటో) - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మూవేందర్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలో వారం రోజుల క్రితం జరిగిన విరుదునగర్ కానిస్టేబుల్ మలైయరసన్ హత్యకేసులో ఓ ఆటో డ్రైవర్‌ను పోలీసులు తుపాకీతో కాల్పులు జరిపి అరెస్టు చేశారు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. మదురై విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో ఈచనేరి ప్రాంతంలో ఈ నెల 18న సగం కాలిన స్థితిలో విరుదునగర్‌కు చెందిన కానిస్టేబుల్ మలైయరసన్ మృతదేహం పడి ఉండగా స్థానికులు చూసి పోలీసులకుఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. హంతకుల కోసం ప్రత్యేక దళాలు సైతం రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పోలీసుల విచారణలో మలైయరసన్ హత్యకేసులో మదురై విల్లాపురానికి చెందిన మూవేందర్ అనే ఆటో డ్రైవర్‌కు సంబంధం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పోలీసులు సోమవారం ఉదయం ఆవనియాపురం వద్ద ఓ ఇంటిలో దాగిన మూవేందర్‌ను చుట్టుముట్టారు. పోలీసులను చూడగానే మారికన్నన్ అనే కానిస్టేబుల్‌పై వేటకొడవలితో దాడి జరిపి పారిపోయేందుకు మూవేందర్ ప్రయత్నించాడు. దీంతో పోలీసులు తుపాకితో కాల్పులు జరిపి పట్టుకుని, అతడిని మదురై రాజాజీ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు.. మూవేందర్‌ను పోలీసులు విచారించగా కానిస్టేబుల్ మలైయరసన్ మదురై వచ్చినప్పుడల్లా తన ఆటోలో ప్రయాణించేవాడని, ఆ పరిచయం పెరగటంతో ఈ నెల 18న పెరుంగుడి వద్ద మద్యం తాగామని, ఆ సందర్భంగా తన వద్దనున్న డబ్బు లాక్కునేందుకు ప్రయత్నించడంతో కోపంతో దాడి చేసి హతమార్చానని తెలిపాడు. ఆ తర్వాత మలైయరసన్ శవాన్ని దూరంగా తీసుకెళ్లి నిప్పంటించి తగులబెట్టానని వాంగ్మూలం ఇచ్చాడు.

యూట్యూబర్ సవుక్కు శంకర్ నివాసంలో
బురద, పేడ చల్లి దుండగుల బీభత్సం

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యూట్యూబర్ సవుక్కు శంకర్ నివాసంలో సోమవారం ఉదయం కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల వేషాల్లో చొరబడిన కొంతమంది బురద, పేడనీళ్లు చల్లి నానాబీభత్సం సృష్టించారు. సవుక్కు శంకర్ వెల్లడించిన సమాచారం ప్రకారం సుమారు 50 మంది ఉదయం 9.30 గంటలకు ఆ ఇంటిలో చొరబడ్డారు. ఆసమయంలో ఆయన తల్లి మాత్రమే ఇంటిలో ఒంటరిగా ఉన్నారు. దుండగులు పడకగది, వంటగదిలో బురదనీళ్లను, పేడనీళ్లను చల్లి, వస్తువులను చెల్లాచెదురుగా పడవేశారు. కొన్ని వస్తువులను నేలకేసి పగులగొట్టారు. ఈ విషయం తెలుసుకున్న సవుక్కు శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లేలోగా దుండగులు పారిపోయారు. సవుక్కుశంకర్ ఇటీవల యూట్యూబ్‌లో పారిశుధ్య కార్మికులను కించపరిచేలా విమర్శలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కార్మికులు తీవ్ర నిరసన కూడాప్రకటించారు. ఆ నేపథ్యంలో సవుక్కు శంకర్ తన ఇంటిపై పారిశుధ్య కార్మికులే దాడి చేసి, గదుల నిండా బురద చల్లారని అన్నారు. ఈదాడి వెనుక నగర పోలీసుకమిషనర్ ప్రమేయం ఉందని ఆరోపించారు. బీభత్సానికి పాల్పడినవారంతా అక్కడికి వెళ్లిన పాత్రికేయులను కూడా బెదిరించి తరిమికొట్టారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వేర్వేరు ప్రకటనలో నిరసన వ్యక్తం చేశారు. సవుక్కు శంకర్ నివాసంలో బురదను చల్లినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ సంఘటన వెనుక సూత్రధారులను కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తమిళగవెట్రి కళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కూడా సవుక్కుశంకర్ నివాసంలో జరిగిన బీభత్సాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఓ ప్రకటన జారీ చేశారు.

మా డిమాండ్లను నెరవేర్చండి!
● తిరుత్తణి లోడ్ లిఫ్టింగ్ కార్మికుల నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

తిరుత్తణి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో తమిళనాడు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ (టీఎన్‌సీఎస్‌సీ) కార్యాలయం ఎదుట లోడ్ లిఫ్టింగ్ కార్మికులు వినూత్న నిరసనకు దిగారు. అర్ధనగ్నంగా నిల్చుని చేతిలో పల్లెం పట్టుకుని భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు వీరరాఘవన్ మాట్లాడుతూ, గత పదేళ్ళుగా తమకు ప్రభుత్వం నుండి రావల్సిన సహాయాలు పూర్తిస్థాయిలో అందడంలేదని, ఎన్నో ఏళ్ళుగా ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం తమకు సరైన గుర్తింపునిచ్చి, రాత్రివేళలో లోడింగ్ చేసే కార్మికులకు వేతనాన్ని 2శాతం పెంచాలని, లోడ్ లిఫ్టింగ్‌లో మరణిస్తే ఆ కార్మికుడి కుటుంబానికి ఇచ్చే నష్టపరిహారాన్ని రూ.7లక్షల నుండి రూ.15 లక్షలకు పెంచాలని తదితర డిమాండ్లతో కూడిన పత్రాన్ని గతంలో జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఇచ్చామని అయినా ఎలాంటి స్పందన రాలేదని వాపోయారు. ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చకపోతే పెద్దఎత్తున నిరసనలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

నూనె గోదాములో భారీ అగ్ని ప్రమాదం



గోదాములో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక దళం

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఆలంగుడి దర్గా వీధిలో సాహుల్ అనే వ్యక్తి నడుపుతున్న వంట నూనెల గోదాములో సోమవారం వేకువజాము సంభవించిన అగ్ని ప్రమాదంలో లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో గోదాములో నిల్వచేసిన వేరుశెనగ, నువ్వుల నూనె, కొబ్బరి నూనె, నువ్వుల బస్తాలు, వేరుశెనగ పప్పు బస్తాలు కాలిబూడిదయ్యాయి. ఈ సమాచారం అందుకుని హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక దళం ఆరుగంటల సేపు శ్రమించి మంటలను ఆర్పివేశారు.

మంత్రి సెంథిల్ బాలాజీకి సుప్రీంకోర్టు నోటీసు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్‌కు వ్యతిరేకంగా ఈడీ దాఖలుచేసిన కేసులో మంత్రి సెంథిల్ బాలాజీ పదిరోజుల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మంత్రి సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ఈడీ నమోదుచేసిన కేసులో ఆయనకు మంజూరు చేసిన బెయిలు రద్దు చేయాలని కోరుతూ చెన్నైకి చెందిన విద్యాకుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు న్యాయమూర్తి అభయ్ ఎస్ ఓహా నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తోంది. సెంథిల్ బాలాజీని మంత్రి కొనసాగించడానికి అనుమతిస్తారా అంటూ ధర్మాసనం ఇదివరకే ప్రశ్నించింది. ఈ క్రమంలో, ఈ కేసు విచారణ సోమవారం జరిగిన నేపథ్యంలో, సెంథిల్ బాలాజీ మంత్రిగా కొనసాగుతారని అతడి తరపున హాజరైన న్యాయవాది ముకుల్ రోత్గి తెలిపారు. ఈ విషయమై సవివరంగా సమాధానం ఇచ్చేందుకు సమయం కావాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు. అనంతరం పది రోజుల్లో సమాధానం ఇవ్వాలని ధర్మాసనం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

జాక్టో-జియో ఆందోళనలకు
నిషేధం విధించాలంటూ పిటిషన్

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాక్టో-జియో ఆందోళనలకు నిషేధించాలంటూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. పాత పింఛన్ విధానం, ఖాళీ పోస్టుల భర్తీ సహా పలు సమస్యల పరిష్కారానికి జాక్టో-జియో దశలవారీ ఆందోళనలు చేపడుతోంది. ఈ ఆందోళనల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై నిషేధం విధించాలని హైకోర్టు ప్రజావ్యాజ్యం దాఖలైంది. ఈ కేసు సోమవారం విచారణకు రాగా, అఫిడవిట్ దాఖలు అవకాశం కల్పించాలని ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు, విచారణ వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

బ్లాక్‌లో ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం
● 11 మంది అరెస్ట్

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయించిన 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీఎల్ పోటీల్లో భాగంగా చేపాక్కం స్టేడియంలో ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్-ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించారు. టిక్కెట్లు దొరకని అభిమానులు కొంతమంది స్టేడియం వద్ద వేచి ఉన్నారు. వీరిని గమనించిన పలువురు బ్లాక్‌లో మ్యాచ్ టిక్కెట్లను అధిక ధరకు విక్రయించారు. దీన్ని అడ్డుకొనేలా నగర పోలీస్ కమిషన్ అరుణ్ ఉత్తర్వులతో ఏర్పాటైన ప్రత్యేక బృందం స్టేడియం, పరిసర ప్రాంతాల్లో గస్తీ తిరిగారు. బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసి, వారి నుంచి 25 టిక్కెట్లు, రూ.40,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

వీసీ పోస్టులను భర్తీ చేయాలి
● పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్

ప్యారీస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖలో ఖాళీ అయిన 8 వైస్‌ఛాన్స్‌లర్ల పోస్టులను భర్తీచేయాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆయన సోమవారం విడుదలచేసిన ప్రకటనలో, మద్రాస్ విశ్వవిద్యాలయం, మదురై కామరాజర్ విశ్వవిద్యాలయం సహా 8 విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్లను నియమించకపోవడంతో అభివృద్ధి పనులు స్తంభించిపోయాయన్నారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్రప్రభుత్వాల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా కొత్తవీసీలను నియమించలేదని అందువల్ల పలు విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవాలు కూడా నిర్వహించలేదని, దీంతో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు నష్టపోతున్నారని రాందాస్ తెలిపారు.

‘యోలో’ ఫస్ట్‌లుక్ - ఫస్ట్ సింగిల్ విడుదల



‘యోలో’ ఆడియో రిలీజ్ దృశ్యం

ఎం ఆర్ మోషన్ పిక్చర్స్ పతాకంపై మహేష్ సెల్వరాజ్ నిర్మాణంలో ఎస్.శ్యామ్ దర్శకత్వంలో కొత్త యువకుడు దేవ్ హీరోగా నటించిన చిత్రం ‘యోలో’. రొమాన్స్ కామెడీ జోనర్‌లో ఫాంటసీ కలగలిపి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. ఈ మూవీ ఫస్ట్‌లుక్, ఫస్ట్ సింగిల్‌ను తాజాగా గిండీలోని అన్నా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రిలీజ్ చేశారు. జెన్ జడ్ జనరేషన్‌ను ఆకట్టుకునే విధంగా, రొమాన్స్‌లో ఉగ్రూతలూగే ప్రేమికుల కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ దర్శకులు అమీర్, సముద్రఖని వద్ద అసోసియేట్ డైరెక్టరుగా పనిచేసిన ఎస్.శ్యామ్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. దేవ్, దేవిక హోరీ హీరోయిన్లుగా నటించగా, ఇతర పాత్రల్లో బడవ గోపి, ప్రవీణ్, స్వాతి నాయర్, ఆకాష్ ప్రేమ్, నీతి ప్రదీప్, దివాకర్, యువరాజ్, వీజే నిక్కి, దీపికా, దీప్సన్, సుబ్బు తదితరులు నటించారు. ఇందులో మొత్తం ఆరు పాటలు ఉండగా, ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, ప్రియాంక కలిసి ఒక పాట ఆలపించారు.

ఫెఫ్సీ కార్యాలయం ముందు నటి సోనా ధర్నా



ధర్నా చేస్తున్న సోనా

తన స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రూపొందిన ‘స్మోక్’ సినిమా కాపీ ఉన్న హార్డ్ డిస్క్ తీసుకున్న ఓ వ్యక్తి అది తిరిగివ్వకుండా వేధిస్తున్నాడంటూ సినీ నటి సోనా సోమవారం వడపళనిలోని దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సంఘ సమాఖ్య - పెఫ్సీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. తమిళ చిత్రపరిశ్రమలో శృంగారతారగా గుర్తింపు పొందిన నటి సోనా.. 20 యేళ్ళుగా తమిళ, తెలుగు, మలయాళం, కన్నడంతో పాటు పలు భాషా చిత్రాల్లో నటిస్తున్నారు. ఇటీవల హీరో జై నటించిన ‘కనిమొళి’ అనే చిత్రాన్ని నిర్మించి భారీ నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో తన జీవిత చరిత్ర ఆధారంగా ‘స్మోక్’ అనే వెబ్ సిరీస్ నిర్మించారు. అయితే, దీన్ని రిలీజ్ చేయకూడదంటూ తనను కొందరు బెదరిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫెఫ్సీ కార్యాలయం ఎదుట హఠాత్తుగా ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, ‘నేను తెరకెక్కించిన బయోపిక్ మూవీ కాపీవున్న హార్డ్ డిస్క్‌ను తీసుకున్న వ్యక్తి తిరిగి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. నా వద్ద మేనేజర్‌గా పనిచేసిన శంకర్ రూ.8 లక్షల వరకు మోసానికి పాల్పడ్డాడు. అతడిపై చర్య తీసుకోవాలని ఫెఫ్సీ నిర్వాహకులకు ఫిర్యాదు చేశాను. కానీ, ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. అందుకే నాకు మరో మార్గం లేక ఇలా ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నా హార్డ్ డిస్క్, నా వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలి. అప్పటివరకు ప్రతి రోజూ వచ్చి ధర్నా చేస్తాను’ అని వెల్లడించారు.

28న వరల్డ్‌వైడ్‌గా ‘తరైపడై’ విడుదల

పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిన ‘తరైపడై’ ఈ నెల 28న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. స్టోనెక్స్ పతాకంపై పీబీ వేల్‌మురుగన్ నిర్మాణంలో రామ్‌ప్రభు దర్శకత్వం వహించిన చిత్రం ‘తరైపడై’. జీవీ, ప్రజిన్, విజయ్ విశ్వ హీరోలుగా నటించగా, ముగ్గురు నూతన నటీమణులు హీరోయిన్లుగా నటించారు. అన్ని భాషల నేటివిటీకి అనుగుణంగా రూపొందించిన ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు సహా పలు భాషల్లో విక్కీ ఫిలిమ్స్ రిలీజ్ చేస్తున్నారు. మూవీ గురించి దర్శకుడు మాట్లాడుతూ, ‘వ్యాపారం పేరుతో ప్రజల డబ్బును ఓ ముఠా దోచుకుంటుంది. ఈ డబ్బును మరో గ్యాంగ్‌స్టర్ దోచుకుంటాడు. ఇలా అనేక మంది చేతుల్లో మారే ఈ డబ్బు.. చివరకు ఎవరికి చేరుతుందన్న ఆసక్తికరమైన కథాంశంతో యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందించాం. ఈ సినిమా కోసం రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. పైగా ఈ మూవీలో హీరో ఎవరు? విలన్ ఎవరు? ఇతర పాత్రలను డిజైన్ చేసిన తీరు ఆశ్చర్యపరిచేలా ఉంటాయి. మూవీ స్క్రీన్‌ప్లే గతంలో ఎన్నడూ చూడనివిధంగా ఉంటుంది’ అని పేర్కొన్నారు.



‘తరైపడై’లో ఓ దృశ్యం



ఇష్టపూర్వకంగానే విడిపోతున్నాం

● కోర్టుకు తెలిపిన జీవీ ప్రకాష్ - సైంధవి



తాము ఇష్ట పూర్వకంగా విడిపోతున్నామని అందువలన తమకు విడాకులు మంజూరు చేయాలని చెన్నై ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తికి ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ కుమార్, గాయని సైంధవి విజ్ఞప్తి చేశారు. 2013లో ప్రేమ వివాహం చేసుకున్న వీరికి ఓ కుమార్తె ఉంది. ఈ క్రమంలో వారి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా తాము విడిపోతున్నట్టు 2024లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో తామిద్దరం పరస్పరం విడిపోతున్నామని, అందువల్ల విడాకులు మంజూరు చేయాలని కోరుతూ వారు చెన్నై ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు. వారి తరఫున న్యాయవాది నర్మదా సంపత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా, ఇది సోమవారం మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోని మొదటి అదనపు కుటుంబ సంక్షేమ కోర్టు న్యాయమూర్తి సెల్వ సుందరి ముందు విచారణకు వచ్చింది. ఆ సమయంలో జీవీ ప్రకాష్ కుమార్, సైంధవి ఇద్దరు కోర్టుకు హాజరై తామిద్దరం ఇష్టపూర్వకంగా విడిపోతున్నట్టు న్యాయమూర్తికి తెలిపారు. దీంతో న్యాయమూర్తి తదుపరి విచారణ వాయిదా వేశారు.

కడలూరు తీరానికి వింత వస్తువు

● భీతిల్లిన జాలర్లు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా పుదుసత్రిరం సమీపం సామియార్‌పేట, వేలంగిరాయన్‌పేట మధ్యలో సముద్రతీరానికి సోమవారం ఉదయం కోడిగుడ్డు ఆకారంలో పసుపు రంగు వస్తువు కొట్టుకు వచ్చింది. ఆ వస్తువుపై మాల్దీవులు అని నల్లరంగుతో రాసి ఉంది. ఆ వస్తువును చూడగానే స్థానిక జాలర్లు భీతిల్లారు. వెంటనే మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం తెలుసుకుని మత్స్యశాఖ అధికారులు, పుదుసత్రిరం పోలీసులు, కోస్ట్‌గార్డ్ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ వస్తువును పరిశీలించారు. నీటిపై తేలియాడే ఆ వస్తువు సముద్రంలో సరిహద్దులను తెలియజేయడానికి ఉపయోగించేది అయి ఉంటుందని కోస్ట్‌గార్డ్ అధికారులు అనుమానిస్తున్నారు. అదే విధంగా నౌకలో తేలే బోయా అనే వస్తువు అయి ఉండవచ్చునని మత్స్యశాఖ అధికారులు భావిస్తున్నారు. అన్ని పరీక్షించిన తర్వాత అది పేలుడు వస్తువుకాదని నిర్ధారణ కావటంతో కోస్ట్‌గార్డ్ అధికారులు ఆ వస్తువును వ్యాన్‌లో తరలించారు.



తీరానికి కొట్టుకొచ్చిన వస్తువు లాగుతున్న జాలరి



కవిచక్రవర్తి కంబర్ దినం సందర్భంగా మెరీనాబీచ్‌లోని అన్నా సమాధి ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు తంగం తెన్నరసు, సామినాథన్, ఆర్ ఎస్ రాజకణ్ణప్పన్, శేఖర్ బాబు, మేయర్ ప్రియ తదితరులు

నేడు చెన్నై చేరనున్న సీఐఎస్ఎఫ్ సైక్లథాన్

● మెరీనాలో స్వాగత ఏర్పాట్లు

అడయార్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోస్తాతీర భద్రతపై తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారికి అవగాహన కల్పించే నిమిత్తం సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ ‘సీఐఎస్ఎఫ్ సైక్లథాన్-2025’ పేరుతో సైకిల్ ర్యాలీని ఈ నెల 7వ తేదీ ప్రారంభించారు. ఇది మంగళవారం మెరీనా తీరానికి చేరుకోనున్న సందర్భంగా ఘన స్వాగతం పలుకనున్నారు. మొత్తం 25 రోజుల పాటు సాగే ఈ సైక్లథాన్‌లో సీఐఎస్ఎఫ్ జవాన్లు 6,553 కిలోమీటర్ల మేర తీర ప్రాంతంలో సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇందులో దాదాపు 125 మంది సైక్లిస్టులు పాల్గొన్నారు. వీరిలో 14 మంది మహిళా జవాన్లున్నారు. మొత్తం 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా ఈ ర్యాలీ సాగనుంది. రాణిపేట జిల్లా, తక్కోలం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించిన విషయం తెల్సిందే. వెస్ట్రన్ రూట్‌లో గుజరాత్ రాష్ట్రంలోని కోరి క్రీక్ లఖ్‌పత్ నుంచి కన్నియాకుమారి వరకు 3,775 కిలోమీటర్లు, ఈస్ట్రన్ రూట్‌లో వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో బఖాలీ బీచ్ నుంచి కన్నియాకుమారి మొత్తం 2,778 కిలోమీటర్ల మేరకు ఈ సైకిల్ యాత్ర సాగనుంది. ఈ మార్గంలో సూరత్, ముంబై, గోవా, మంగళూరు, కొచ్చి, కోణార్క్, ప్రదీప్, వైజాగ్, చెన్నై, పుదుచ్చేరిలో కొన్ని ముఖ్య కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇదిలావుండగా మంగళవారం సాయంత్రం ఈ సైక్లథాన్ చేరుకుంటుంది. స్థానిక మెరీనా తీరంలో జరిగే రెడ్ కార్పెట్ స్వాగత కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భద్రతాధికారులు హాజరుకానున్నారు. దీనిపై సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమాండెంట్ నిధి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులు

మేడవాక్కంలో ‘స్టార్‌వుడ్ ప్రీమియర్ లీగ్’

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేడవాక్కంలోని ప్రీమియం హౌసింగ్ సొసైటీ నవీన్స్ స్టార్‌వుడ్ టవర్స్ తమ కమ్యూనిటీలోని ఔత్సాహిక క్రీడాకారుల కోసం స్టార్‌వుడ్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తోంది. స్టార్‌వుడ్ స్పోర్ట్స్ క్లబ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇక్కడ నివశించే సుమారు 120 మందికి పైగా పాల్గొంటున్నారు. ఈ లీగ్ గురించి ఆదివారం నవీన్స్ డైరెక్టర్ క్లీర్ వసుధకుమార్ మాట్లాడుతూ.. ఐపీఎల్ తరహాలో ఫ్రాంచైజీ యజమానులు, ఆటగాళ్ల వేలం భావనతో పాయింట్లతో కూడిన ప్రత్యేకమైన లీగ్ మూడో ఎడిషన్‌తో అనుబంధం వుండడం సంతోషంగా వుందన్నారు. ఈ సీజన్‌లో మహిళల త్రోబాల్, పురుషులకు క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌లు వుంటాయన్నారు. లీగ్‌లో మొత్తం 18 క్రికెట్ మ్యాచ్‌లు, 14 వాలీబాల్, 14 త్రోబాల్ మ్యాచ్‌లు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఈవెంట్‌లకు సంబంధించిన జెర్సీలను కూడా లాంఛనంగా ఆవిష్కరించారు.



జెర్సీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

‘శ్రీ కళాసుధ’ ఆధ్వర్యంలో 30న ఉగాది, మహిళా రత్న పురస్కారాల ప్రదానోత్సవం

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ‘శ్రీ కళాసుధ’ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఉగాది పురసార్కాల ప్రదానోత్సవం జరుగనుంది. రాయపేట టీటీకే రోడ్డులో వున్న మ్యూజిక్ అకాడమీలో జరిగే ఈ ఉత్సవానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా, ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళీకృష్ణ విశిష్ట అతిథిగా, మాజీ డీజీపీ ఆర్.శేఖర్, అపోలో ఫార్మాసీస్ లిమిటెడ్ ఎండీ ఎస్.ఓబుల్ రెడ్డి, సీనియర్ నిర్మాత ఏఎం రత్నం, తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ వల్లేపల్లి, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి గౌరవ అతిథులుగా హాజరు కానున్నారు. వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్ పద్మ దేవదాస్ జ్యోతిప్రజ్వలనంతో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కళాసుధ వ్యవస్థాపక అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతం పలుకనున్నారు.

పురస్కారాలివే...

ప్రజలకు విశేష సేవలందిస్తున్న నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ‘విశిష్ట ఉగాది పురస్కారం’, ప్రశాంతి వేమిరెడ్డికి, విద్యారంగానికి చెందిన సరోజా వివేకానందకు ‘మహిళా రత్న’ పురస్కారాలు, ప్రముఖ సినీ నేపథ్యగాయని కల్పనకు ‘లతా మంగేష్కర్’ పురస్కారం, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు ‘పీబీ శ్రీనివాస్’ పురస్కారం ప్రదానం చేయనున్నారు. అదే విధంగా సినీరంగంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు కూడా అందజేయనున్నారు. ‘లక్కీ భాస్కర్’ ఫేమ్ మీనాక్షి చౌదరి, ‘ఏజెంట్’ ఫేమ్ సాక్షి వైద్యకు ‘బాపూ బొమ్మ’ పురస్కారం, ప్రముఖ నటులు దుల్కర్ సల్మాన్, ప్రశాంత్‌వర్మకు ‘బాపూ రమణ’ పురస్కారం అందజేస్తారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి కుటుంబానికి రెండు గ్రాముల వెండి నాణెం బహుమతిగా ఇస్తామని నిర్వాహకులు బేతిరెడ్డి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ తరగతులు

● ఐసీఎస్ఐ అధ్యక్షుడు ధనుంజయ్ శుక్లా



మీడియా సమావేశంలో నిర్వాహకులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ‘ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా’ (ఐసీఎస్ఐ) తన ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ విద్యార్థుల కోసం కేంద్రీకృత ఉచిత ఆన్‌లైన్ తరగతులు, ఆన్‌లైన్ సందేహ నివృత్తి తరగతులను ప్రారంభించిందని ఐసీఎస్ఐ అధ్యక్షులు సీఎస్ ధనుంజయ్ శుక్లా, ఉపాధ్యక్షులు సీఎస్ పవన్ జి.చందక్ తదితరులు తెలిపారు. ఆదివారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. చెన్నైలో ధర్మమూర్తి రావ్ బహదూర్ కలవల కన్నన్ చెట్టి కాశాల, దేవ్‌కుమార్ నానాబాల్ భట్ వైష్ణవ్ కాలేజీ ఫర్ ఉమెన్, అల్ఫా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్శిటీల్లో ఐసీఎస్ఐ అధ్యయన కేంద్రాలున్నాయన్నారు. చెన్నైలో మొత్తం 7,952 మంది, తమిళనాడు మొత్తంలో 13,808 మంది విద్యార్థులు ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ స్థాయిలో ఐసీఎస్ఐలో నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన, ఆర్థికంగా బలహీనమైన విద్యార్థులకు ఫీజు మినహాయింపును అందిస్తున్నామన్నారు.

సేలంలో ‘సొల్ తమిళ్ సొల్’కు విశేష స్పందన



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఎం తమిళ ‘పేరయం’ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ‘సొల్ తమిళ్ సొల్’ కార్యక్రమం ఆదివారం సేలం నగరంలోని ఏవీఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విజయవంతంగా జరిగింది. 150 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలకు హాజరు కాగా, ఆరుగురు న్యాయనిర్ణేతల వారి ప్రతిభను పరీక్షించారు. పలు రౌండ్లలో జరిగిన ఈ పోటీలో మొదటి బహుమతిగా పన్నారి అమ్మన్ టెక్నికల్ కాలేజీ విద్యార్థి దయానిధికి రూ. లక్ష, ద్వితీయ బహుమతిగా ఈరోడ్డు లా కాలేజీకి చెందిన జ్ఞాన ప్రకాష్‌కు రూ.75 వేలు, తృతీయ బహుమతిగా సేలం ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని కనిమొళికి రూ.50వేలు, మరో ఐదుగురికి రూ.20 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అంతేగాక విజేతలకు సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేశారు. తమిళ పేరయం ఛైర్మన్ నాగరాజన్ ఈ అవార్డులను అందజేశారు.

రూ.120 కోట్లతో పూడికతీత పనులు

● మంత్రి దురైమురుగన్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల తో చెరువులు, సాగునీటి కాల్వలలో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. శాసనసభలో సోమవారం ఉదయం నీటివనరుల శాఖకు సంబంధించిన ఆర్థిక పద్దులపై ఆయన మాట్లాడుతూ చెన్నై, తిరుచ్చి, మదురై, కోయంబత్తూరు ఇరిగేషన్ జోన్లలో ఉన్న చెరువులు, సాగునీటి కాల్వలలో పూడిక తీత పనులు జరుగనున్నాయని తెలిపారు. **స్పీకర్ ఆశీస్సులు...:** నీటివనరుల శాఖకు సంబంధించిన ఆర్థిక కేటాయింపులపై శాసనసభలో మాట్లాడేందుకు మంత్రి దురైమురుగన్ అనారోగ్య పరిస్థితుల వల్ల సీటులో కూర్చుని మాట్లాడేందుకు అనుమతివ్వాలని స్పీకర్ అప్పావును కోరారు. స్పీకర్ అందుకు అనుమతినిస్తూ మంత్రి దురైమురుగన్ నూరేళ్లు జీవించాలని ఆశీర్వదిస్తున్నట్లు తెలిపారు. మంత్రి దురైమురుగన్ స్పందిస్తూ స్పీకర్ మాట ఫలిస్తుందనే నమ్మకం తనకుందని చెప్పగానే పక్కనే ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులంతా హర్షం వ్యక్తం చేశారు. ఆ తరువాత ఆయన కూర్చునే ప్రసంగించారు.

వాయులీన విద్వాంసుడు ఆర్కే శ్రీరామ్‌కుమార్‌కు ‘సంగీత కళానిధి’ పురస్కారం



ఆర్కే శ్రీరామ్‌కుమార్

టి.నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసులు ఆర్కే శ్రీరామ్‌కుమార్‌కు 2025వ సంవత్సరానికిగాను ‘సంగీత కళానిధి’ అవార్డు ప్రదానం చేయనున్నట్లు మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు ఎన్.మురళి ప్రకటించారు. ఆదివారం సాయంత్రం అకాడమీ నిర్వాహక కమిటీ సమావేశమై సంగీత కళానిధి, నృత్య కళానిధి అవార్డుల కోసం కళాకారులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆ మేరకు ఈ యేడాది ‘సంగీత కళానిధి’ అవార్డుకు వయోలిన్ విద్వాంసులు ఆర్కే శ్రీరామ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. శ్రీరామ్‌కుమార్ తన తాతగారైన ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ఆర్కే వెంకటరామశాస్త్రి వద్ద శిష్యరికం చేసి, వయోలిన్ కళాకారుడిగా ఉన్నత స్థితికి చేరుకున్నారని తెలిపారు.

‘సంగీత కళా ఆచార్య’ అవార్డులు... : అదే విధంగా సీనియర్ సంగీత కళాకారుడు శ్యామలా వెంకటేశ్వరన్, డోలు వాద్యకళాకారుడు తంజావూరు ఆర్.గోవిందరాజన్‌లను ‘సంగీత కళా ఆచార్య’ అవార్డుకు ఎంపికచేశారు. టీటీకే అవార్డుకు కథకళి కళాకారుడు మాడంబి సుబ్రమణ్య నంబూద్రి, వైణికులు జేడీ జయరాజ్ కృష్ణన్, జయశ్రీ జయరాజ్ కృష్ణన్ ఎంపికయ్యారు. ఇక ‘ఇసై అరింజర్’ అవార్డుకుగాను ప్రముఖ సంగీత కళాకారుడు, ఆచార్యులు సీఏ శ్రీధర్ ఎంపికయ్యారు.

నృత్య కళానిధి అవార్డు...

సుప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి ఊర్మిళను ‘నృత్య కళానిధి’ అవార్డుకు ఎంపిక చేశారు. సంగీత కళానిధి అవార్డుకు ఎంపికైన ఆర్కే శ్రీరామ్‌కుమార్ ఈ యేడాది డిసెంబర్ 15న ప్రారంభమయ్యే మ్యూజిక్ అకాడమి 99వ వార్షిక సదస్సుకు అధ్యక్షత వహించనున్నారు. వచ్చే యేడాది జనవరి 1న నిర్వహించే సదస్ ఉత్సవాల్లో ఎంపికైన కళాకారులకు ‘సంగీత కళానిధి’ ‘సంగీత కళా ఆచార్య’ అవార్డులు ప్రదానం చేయనున్నారు. జనవరి 3న జరిగే మ్యూజిక్ అకాడమీ 19వ నాట్యోత్సవాల్లో ‘నృత్య కళానిధి’ అవార్డు ప్రదానం చేస్తారు.



నృత్య కళానిధి అవార్డుకు ఎంపికైన భరతనాట్య కళాకారిణి ఊర్మిళ



తిరుచెందూరు ఆలయ రాజగోపురంపై
భారీ శూలాయుధం

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రమణ్యస్వామి ఆలయ రాజగోపురం గంభీరంగా దర్శనమిస్తోంది. 15 ఏళ్ల అనంతరం జూన్ 7న ఈ ఆలయ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయం, ప్రాంగణాలకు రంగులు వేస్తున్నారు. ప్రస్తుతం రాజగోపురం తెల్లటి రంగుతో సరికొత్త సొబగులతో దర్శనమిస్తోంది. రాజగోపురం మధ్యలో ఎరుపు రంగుతో ఏర్పాటుచేసిన వేలాయుధం కింది భాగంలో అమర్చిన ఎల్ఈడీ బల్బుల కాంతులతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

కోరుకున్నదానికన్నా దేవుడు ఎక్కువే ఇచ్చాడు
- సినీ నటుడు సుమన్



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): 'నేను కోరుకున్నదానికంటే దేవుడు నాకు ఎక్కువే ఇచ్చాడు' అని సినీనటుడు సుమన్ అన్నారు. ఎలాంటి సినిమా బ్యాగ్రౌండ్ లేని తాను తన తల్లిదండ్రులు చేసిన పుణ్యఫలంగా మంచి స్థాయికి ఎదిగానన్నారు. తన జీవితంలో ఏది జరిగినా, తాను ఏం చేసినా అది స్వామి లీలేన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీరాముడిగా, సత్యనారాయణస్వామిగా దేవుడి పాత్రల్లో నటించడం గొప్పవరమన్నారు. స్వామి ఆశీస్సులతో అనేక సినిమాల్లో తాను బిజీగా గడుపుతున్నానని చెప్పారు. తొలిసారిగా తుళు భాషలో నటిస్తున్నాని సుమన్ తెలిపారు. అలాగే కాంత, సత్యంగారి అబ్బాయి, ధర్మస్థల నియోజకవర్గం అనే మూడు సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నాని, ప్రస్తుతం 'కాంత' చిత్ర షూటింగ్ గుజరాత్‌లో జరుగుతోందన్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.94 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,198
తలనీలాలు సమర్పించినవారు: 25,665

ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటాం
● ఇఫ్తార్ విందులో స్టాలిన్

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. తిరువాన్మియూరులో సోమవారం సాయంత్రం డీఎంకే మైనారిటీ సంక్షేమం, హక్కుల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇఫ్తార్ విందులో ఆయన ప్రసంగిస్తూ ముస్లింలకు డీఎంకే మధ్య ఉన్న సంబంధం ఈనాటిది కాదని, డీఎంకే ఆవిర్భావం నుంచి ఈ బంధం కొనసాగుతూనే ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాజకీయ భావాలను మార్చిన ఘనత 'దారూల్ ఇస్లామ్' సంచిక కీలక పాత్ర పోషించిందని, అదే విధంగా కరుణానిధి, అన్నాదురై మధ్య సన్నిహిత సంబంధాలను పటిష్టపరచటంలో దావూద్‌షా ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. కరుణానిధి రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుండి ఎంతో మంది ముస్లిం సోదరులు ఆయనకు అండగా నిలిచారని, ఆ రీతిలోనే ప్రస్తుతం తనను కూడా ఆదరిస్తున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. మిలాదున్ నబీకి ప్రభుత్వ సెలవు ప్రకటించింది, ఉర్దూ మాట్లాడేవారిని బీసీల జాబితాలో చేర్చింది, మైనారిటీ సంక్షేమ సంస్థ ఏర్పాటు చేసింది కరుణానిధి ప్రభుత్వ హాయంలోనేనని చెప్పారు. ఆ చట్ట సవరణకు మద్దతుగా పార్లమెంట్‌లో ఓటువేసి అన్నాడీఎంకే ముస్లింలకు తీరని ద్రోహంచేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీల ఆర్థికాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తురైముగం ఖాజా అధ్యక్షత వహించారు. మంత్రులు ఎం. సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, నాజర్, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ముస్లింలీగ్ నాయకుడు ఖాదర్ మొయిద్దీన్, కాంగ్రెస్ నేత పీటర్ ఆల్ఫోన్స్, మనిదనేయ మక్కల్ కట్చి నేత జవాహిరుల్లా, వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు నవాజ్‌ఘనీ, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

తీర ప్రాంత భద్రతకు
సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ



ర్యాలీ బృందంతో షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర అధికారులు

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ సోమవారం సూళ్లూరుపేటకు చేరింది. హోలీక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై షార్, రెవెన్యూ అధికారులు, పోలీసులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా తడ మండలం అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌కు చేరుకొన్నారు అక్కడ ఇస్రో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలీ సిబ్బందికి షార్ డైరెక్టర్ రాజరాజన్, నాయుడుపేట డీఎస్పీ స్వాగతం పలికి అభినందించారు. మార్చి 7న కోల్‌కత్తా నుంచి ప్రారంభమైన సైక్లోథాన్ ర్యాలీ.. మార్చి 31న కన్నియాకుమారికి చేరడంతో ముగుస్తుందని శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజిత్ కుమార్ తెలిపారు. సముద్ర మార్గాల్లో ఉగ్రవాదుల చొరబాటు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ తమిళనాడులోకి ప్రవేశించింది.



కొత్తగా నిర్మించనున్న బస్టాండ్ నమూనా

తిరువాన్మియూర్‌కు నూతన బస్ టెర్మినస్

వాషర్‌మెన్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై వాసులు చిరకాలంగా ఎదురు చూస్తున్న తిరువాన్మియూర్ బస్ టెర్మినస్ పునర్నిర్మాణానికి ఎట్టకేలకు పనులు ప్రారంభంకానున్నాయి.. తిరువాన్మియూర్ బస్ టెర్మినస్‌లో బస్ డిపో కూడా ఉంది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ టెర్మినల్ మీదుగా ఈసీఆర్, మహాబలిపురం, కడలూరు, పాండిచ్చేరి తదితర ప్రాంతాలకు సబర్బన్ బస్సులు నడుస్తున్నాయి. సిటీ బస్సులు, సబర్బన్ బస్సులు చేే ఈ ప్రధాన కూడలి ప్రాంతం నుంచి ప్రతి రోజూ వేలాది మంది ప్రయాణిస్తున్నారు. దీనికి తోడు తరమణి, ఓఎంఆర్ ఐటి హబ్‌లు సమీపంలోనే ఉండడంతో దీని చుట్టూ ఉన్న ప్రాంతాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోయింది. దాంతో సిటీ బస్సుల రాకపోకల సంఖ్య గణనీయంగా పెరిగి, తిరువాన్మియూరు టెర్మినస్ ప్రైమ్ లొకేషన్‌గా మారింది. అయితే లొకేషన్ స్థాయికి తగ్గట్టు ప్రస్తుత బస్టాండ్ లేదు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బస్టాండు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణికులకే కాదు, సిబ్బందికి కూడా మౌలిక సదుపాయాలు లేక సతమతమవుతున్నారు. ఇక వర్షాకాలం పరిస్థితి వేరేగా చెప్పనవసరం లేదు. దీంతో ఈ టెర్మినస్‌కు మంచి రోజులు ఎప్పుడు వస్తాయా అని చెన్నై వాసులు నిరీక్షిస్తూ వచ్చారు. వీరి నిరీక్షణకు తెరదించుతూ సీఎండీయే అధికారులు తీపి కబురు ప్రకటించారు. తిరువాన్మియూర్ బస్ టెర్మినస్‌ను కూల్చి ఆ స్థానంలో అధునాతనంగా టెర్మినల్, డిపో నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. నిర్మాణ పనులు రూ. 35.11 కోట్లతో 12 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. మొత్తం 2.95 ఎకరాల్లో మౌలిక సదుపాయాలతో నూతన టెర్మినల్, డిపోలు ఆధునిక స్థాయిలో నిర్మాణం కానున్నాయి. కాగా టెర్మినల్‌ను అంతర్జాతీయ ప్రామాణాలతో నిర్మించనునట్టు వెల్లడించిన అధికారులు, బస్సుల రాకపోకల సమయాన్ని సూచించడానికి నియాన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇది అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ప్రాజెక్టు కావడంతో సీఎండీయే మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో పనులు సాగుతాయని అధికారులు వెల్లడించారు.

ఊటీ-కున్నూరు మధ్య సమ్మర్‌సీజన్ ప్రత్యేక రైళ్లు



టి.నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా ఊటీ - కున్నూరు మధ్య ప్రత్యేకంగా కొండ రైలు సర్వీసులను నడుపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఊటీలో సమ్మర్ సీజన్ ప్రారంభం కానుండటంతో పర్యాటకుల సందడి కొండ రైలులో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కున్నూరు నుండి ఊటీ వరకు ఈ నెల 28 నుంచి జూలై 7 వరకు శుక్ర, శని, ఆది, సోమవారాల్లో ప్రత్యేక సర్వీసులుగా కొండరైళ్లను నడుపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. కున్నూరు నుండి ఊటీ వరకు ఐదు బోగీలతో సమ్మర్ స్పెషల్ కొండరైలు నడుపుతారు. కున్నూరు నుంచి ఊటీ వరకు మొత్తం 210 సీట్లలో 80 సీట్లు ఫస్ట్‌క్లాస్, 130 సీట్లు సెకండ్ క్లాస్ ప్రయాణికులకు కేటాయిస్తారు. కున్నూరు నుండి ఉదయం 8.20 నుండి బయల్దేరే రైలు ఉదయం 9.40 గంటలకు ఊటీ రైల్వేస్టేషన్ చేరుతుంది. మళ్ళీ సాయంత్రం 4.45 గంటలకు కున్నూరు నుండి బయలుదేరి సాయంత్రం 5.55 గంటలకు ఊటీకి చేరుతుంది. ఊటీ నుండి కేత్తి వరకు నడుపనున్న కొండ రైలు వారానికి నాలుగు రోజులు శుక్ర, శని, ఆది, సోమవారాల్లో నడుపుతారు. ఈ రైలు ఊటీ రైల్వేస్టేషన్ నుండి ఆరుసార్లు కేత్తి రైల్వేస్టేషన్ వరకు నడుపుతారు. ఉదయం 9.45, 11, 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.10, 3 గంటలకు సాయంత్రం 4.30 గంటలకు కేత్తి రైల్వేస్టేషన్‌కు నడుపుతారు.

నల్లగంగమ్మ జాతర సందడి



విశ్వబ్రాహ్మణ వీధిలోని నల్లగంగమ్మ అమ్మవారు

శ్రీకాళహస్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెట్టు, విశ్వబ్రాహ్మణ వీధుల్లో జాతర సందడి నెలకొంది. పట్టణం లోని తెట్టు కూడలి వద్ద కొలువై ఉన్న నల్లగంగమ్మ జాతరకు సోమవారం వేకువ జామున చాటింపు జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువు దీ ర్చనున్నారు. బుధవారం వేకువ జామున అమ్మవారి ఊరే గింపు ఆలయం నుంచి బహదూరుపేటలో సాగి తిరిగి కంతా వీధిలో అమ్మవారు కొలువుదీర్చుతారు. బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనంతో జాతరకు ముగింపు జరుగు తుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ అలంకరణలతో ఈ ప్రాంతం సుందరంగా ముస్తాబైంది. అలాగే ఇక్కడికి సమీపంలో ఉన్న విశ్వబ్రాహ్మణవీధిలోని నల్లగంగమ్మ అమ్మవారి జాతర కూడా బుధవారం జరగనుంది. యేటా రెండు నల్ల గంగమ్మల జాతర మహోత్సవాలు తూర్పు కనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ జాతర రోజే జరగడం ఆనవా యితీ. ఇందులో భాగంగా విశ్వబ్రాహ్మణవీధిలో అమ్మవారి ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో, అమ్మవారి మూల మూర్తిని వెండి కవచాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచి విశేష అభిషేకాలు, హారతులు ప్రారంభం కానున్నాయి. మంగళవారం సాయంత్రం కుంభం సమర్పణ జరగనుంది. అనంతరం బుధవారం జాతర వేడుక కొనసాగుతుంది.

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర
● తూర్పుకనుపూరులో మొదలైన సందడి



బంగారుచీర అలంకరణలో అమ్మవారు (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకొచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠంచడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకూ భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. జాతరలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలో స్థిర పడిన వారు గ్రామాలకు చేరుకోవడం.. బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది. కాగా, మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపు, 26న యార గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 27న పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ, 28న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలం పాటలతో జాతర ముగుస్తుంది. ఈ జాతర కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. జాతర ఏర్పాట్లను సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పర్యవేక్షిస్తున్నారు.



ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం

భక్తులకు తగిన ఏర్పాట్లు

తూర్పు కనుపూరు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచీ వేలాదిగా భక్తులు వస్తారు. వీరందరికీ తాగునీరు, వైద్యశిబిరాలు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

గూడూరుకు 30 కిలోమీటర్ల దూరంలో తూర్పుకనుపూరు ఉంది. గూడూరు, నెల్లూరు, వరగలి క్రాస్‌రోడ్డు, చింతవరం, కోట, నాయుడుపేట ప్రాంతాల్లో అందుబాటులో ప్రత్యేక బస్సుల ద్వారా చేరుకోవచ్చు.

అంగన్వాడీలకు త్వరలో
7,900 మంది ఉద్యోగుల నియామకం
● మంత్రి గీతా జీవన్

ప్యారీస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు త్వరలోనే 7,900 ఉద్యోగులను నియమించనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి గీతా జీవన్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రెండ్రోజుల సెలవుల తర్వాత సోమవారం ఉదయం మళ్ళీ ప్రారంభమైంది. అంగవాడీ కేంద్రాల్లో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేస్తారా? అని ఎమ్మెల్యే బాబు ప్రశ్నించారు. ఇందుకు మంత్రి గీతా జీవన్ సమాధానం చెప్తూ, అంగన్వాడీ ఉద్యోగులను ఎంపికకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం గత వారం జీవో చేసిందని వివరించారు. మరో నెల రోజుల్లో అర్హులైనవారిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్న మంత్రి, తొలి దశగా 7,900 మందిని నియమించనున్నట్లు తెలిపారు. వీరితో పాటు మరో 8,917 మంది పౌష్టికాహార సిబ్బందిని కూడా నియమించేందుకు ప్రభుత్వం అనుమతించిందని ఆమె తెలిపారు.

106 కో-ఆప్టెక్స్ విక్రయ కేంద్రాలు...

రాష్ట్రంలో 106 కో-ఆప్టెక్స్ విక్రయ కేంద్రాలు, పొరుగు రాష్ట్రాల్లో 44 విక్రయ కేంద్రాలు పనిచేస్తున్నట్లు జౌళి పరిశ్రమల శాఖామంత్రి ఆర్. గాంధీ పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పల్లవరం డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానం చెప్పారు. దేశవాప్తంగా 150, రాష్ట్రంలో 106 కో-ఆప్టెక్స్ విక్రయ కేంద్రాలున్నాయని, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విక్రయకేంద్రాలకు ప్రజల ఆదరణ బాగా పెరిగిందని మంత్రి తెలిపారు.

జూన్14న తిరుప్పరంగుండ్రం
ఆలయ కుంభాభిషేకం
● హిందూ దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

పెరంబూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంగుండ్రం మురుగన్ ఆలయ కుంభాభిషేకం జూన్ 14వ తేది నిర్వహించనున్నట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు వీవీ రాజన్ చెల్లప్ప మాట్లాడుతూ... మదురై తిరుప్పరంగుండ్రం ఆలయ కుంభాభిషేకం చేయాల్సిన సమయం మించిపోయిందన్నారు. ఈ ఆలయానికి, విశ్వనాథాలయానికి ప్రభుత్వ ప్రకటించిన రోప్‌కార్ ప్రాజెక్ట్ నిధులు కేటాయించకపోవడంతో ఆగిపోయిందని, ప్రస్తుతం రోప్‌కార్ ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉందా? దేవాదాయ శాఖ తరఫున మహిళా కళాశాల ఏర్పాటుచేయాలని కోరారు. అందుకు మంత్రి శేఖర్‌బాబు సమాధానమిస్తూ... తిరుప్పరంగుండ్రం, తిరునీర్‌మలై ఆలయాలకు రోప్‌కార్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రూ.26 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం డిజిటల్, డ్రోన్, జీఓ తదితర మూడు సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రెండు ఆలయాలకు రోప్‌కార్ ఏర్పాటుకు రూ.32 కోట్లు ఖర్చవుతుందని రైట్స్ సంస్థ నివేదిక ఇచ్చిందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అదనపు నిధులు పొంది త్వరలో పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

సచివాలయం ముందు
ఫుట్‌పాత్ వాసుల ధర్నా

ప్యారీస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కేటాయించాలని కోరుతూ సచివాలయం ముందు సోమవారం ఉదయం పెరిమెట్ ప్రాంతానికి చెందిన ఫుట్‌పాత్ వాసులు ధర్నా నిర్వహించారు. పెరిమెట్ వీవీ.రోడ్డు ప్రాంతంలో కొనేళ్ళుగా 60కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఇళ్లు కేటాయించాలని పలుమార్లు వివిధ రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం అసెంబ్లీ హాలులో బడ్జెట్ చర్చ సాగుతున్న సమయంలో సచివాలయాన్ని సుమారు వంద మందికి పైగా మహిళలు ముట్టడించి, తమకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనుమతిలేకుండా ధర్నాలో పాల్గొన్న ఆందోళనాకారులను పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో సచివాలయాన్ని ముట్టడించేందుకు యత్నించే వారిని కిలోమీటర్ దూరంలో అడ్డుకునేలా పోలీసులు సచివాలయంకు వెళ్ళే దారిలో తాత్కాలిక చెక్‌పోస్టు ఏర్పాటుచేశారు. ప్యారీస్ కార్నర్ నుండి రిజర్వు బ్యాంక్ సబ్‌వే మీదుగా వెళ్ళే వాహనాలను తనిఖీ చేస్తున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్

మంగళం,(తిరుపతి) మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునమిత్తూరు మండలం నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి గోవిందం(35) అలియాస్ శివమణిపై పీడీయాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయని టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. శివమణిపై పీడీయాక్టు అమలుకు సిఫార్సు చేయగా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్ అనుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో శివమణిని కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

27, 29 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 29 అంటే వచ్చే గురువారం, శనివారం రెండు రోజులపాటు పలు రైళ్లు రద్దుకానున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పొన్నేరి, కవర్‌పేట రైల్వే స్టేషన్‌ల మధ్య కొంత కాలంగా పట్టాల మార్పిడి, సిగ్నలింగ్ వ్యవస్థ బలోపేతం వంటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా వచ్చే గురు, శనివారాలలో రెండు రోజులపాటు మధ్యాహ్నం 1.20 నిమిషాల నుంచి సాయంత్రం 5.40 నిమిషాల వరకు ఆ పనులను కొనసాగిం చేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట నుంచి ఉదయం 8.10 నిమిషాలకు నెల్లూరుకు బయలుదేరి వెళ్లే మెమో రైలు, 10.30 గంటలకు నెల్లూరు నుంచి చెన్నైకు బయలుదేరి వెళ్లే మెమో రైలుతోపాటు చెన్నై, సూళ్లూరుపేట, చెన్నైల మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. రద్దు అయిన రైళ్లలో సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 12.35, 1.10 నిమిషాలు, 3.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే సబర్బన్ రైళ్లు ఉన్నాయని సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు.

పంటలపై ఆగని ఒంటరి ఏనుగు దాడులు

కల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి (గెండేవారిపల్లి) సమీపంలో ఆదివారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగించింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకుంది. వరి పంటలను ధ్వంసం చేసింది. అనంతరం రైతుల మామిడితోటల్లో కొమ్మలను విరుకుంటూ అడవిలోకి చేరుకుంది. ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫి సిబ్బందితో పాళెం పంచాయతీ జూపల్లి సమీపం తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు వద్దకు చేరుకున్నారు. ఒంటరి ఏనుగు జాడను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాతో గాలింపు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏనుగు జాడను డ్రోన్ కెమెరాతో గుర్తించామన్నారు.